తైక్వాండో పోటీల్లో క్రీడాకారులకు పతకాలు

విశాలాంధ్ర - యలమంచిలి: రాష్ట్రస్థాయి సీనియర్ తైక్వాండో పోటీల్లో జిల్లా జట్టు ఓవరాల్ చాంపియన్‌షిప్ సాధించినట్లు జిల్లా తైక్వాండో కోచ్ నాగిరెడ్డి సత్యనారాయణ తెలిపారు. ఆదివారం కాకినాడ జిల్లా స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో జరిగిన 39వ రాష్ట్రస్థాయి సీనియర్ తైక్వాండో ఛాంపియన్షిప్ పోటీల్లో జిల్లా జట్టు ఓవరాల్ ఛాంపియన్షిప్‌తో పాటు ఉమెన్ ఛాంపియన్షిప్ ప్రథమ స్థానాన్ని కూడా కైవసం చేసుకున్నట్లు తెలిపారు. ఈ పోటీల్లో బాలికల విభాగంలో యు.జయశ్రీ, టీ.శ్వేత, లిఖిత బంగారు పతకాలు, బి.భవాని రజిత పతకం, ఆర్.వల్లవి కాంస్య పతకం సాధించగా బాలుర విభాగంలో ఎం.నాగేశ్వరరావు, విజయ్ కుమార్, ఐ.గురు ప్రసాద్ నాయుడు స్వర్ణ పతకాలు, జి.విజయ్, జి.మోహన్, బి.శేషు కాంస్య పతకాలు సాధించి ఓవరాల్ ఛాంపియన్ షిప్‌ను దక్కించుకున్నారు. మార్చి 24 నుంచి 26వ తేదీ వరకు తమిళనాడు చెన్నై పట్టణంలో జరిగే జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. విజేతలను జిల్లా తైక్వాండో అసో సియేషన్ ప్రధాన కార్యదర్శి అచ్చంనాయుడు అభినందించారు.

కాలంచెల్లిన ఆర్టీసీ బస్సులతో ప్రయాణికుల ఇక్కట్లు

విశాలాంధ్ర - అనంతగిరి: ఘాటీ రోడ్లో నడుస్తున్న ఆర్టీసీ బస్సులు ప్రయాణికుల సహనాన్ని పరీక్షిస్తున్నాయి. అంతంత మాత్రంగా నడుస్తున్న పల్లె వెలుగు బస్సులు ఎక్కడపడితే అక్కడ ఆగిపోతున్నాయి. సోమవారం బొర్రా జంక్షన్‌లో ఆగిపోయిన బస్సు ఉదాహరణగా చెప్పవచ్చు. ఈ బస్సులు ఎప్పుడో 15 ఏళ్ల క్రితంవి కావడం వల్ల ఘాట్‌రోడ్డులో తరచూ ఆగిపోతున్నాయని ప్రయాణి కులు ఆరోపిస్తున్నారు. దీంతో ప్రైవేట్ వాహనాలను, ఆటోలను ఆశ్రయించక తప్పడం లేదు. అదే విధంగా సోమవారం అదే బొర్రా జంక్షన్‌లో అధిక ధర తీసుకునే డీలక్స్ బస్సు కూడా సాంకేతిక లోపంతో ఆగిపోయింది. ఆర్టీసీ అధికారులు స్పందించి ఘాట్ రోడ్లో తిరిగే బస్సులను కండిషన్లో ఎప్పటికప్పుడు ఉంచాలని పలువురు కోరుతున్నారు.

భూమి పేరు మార్పుపై కలెక్టర్‌కు ఫిర్యాదు

విశాలాంధ్ర - పద్మనాభం: మండలంలో సర్వే నెంబర్ 349లో 9 ఎకరాల 40 సెంట్లు భూమిని గత 50 సంవత్సరాలుగా తాత తండ్రుల నుంచి అలబాన అప్పన్న, శీర దేవుడు, కోరాడ నరసింహ రాజు అనే రైతులు మామిడి తోటలు పెంచుకుంటూ ఫల సాయంతో కుటుంబాన్ని పోషించుకుం టున్నామని అయితే కొంతమంది వ్యక్తుల కన్ను తమ స్థలంపై పడిందని తమకు న్యాయం చేయాలని బాధితులు స్పందనలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. రెవెన్యూ అధికారుల సహాయంతో చింతపల్లి అప్పలరాజు అనే వ్యక్తి 9 ఎకరాల 40 సెంట్లు భూమిని తన పేరున రికార్డుల్లో రాయించేసుకున్నాడని వాపోయారు. ఆ భూమి తనదంటూ తమను ఇబ్బందులు పెడుతున్నాడని వాపోయారు. తమ భూమిని తనకు వన్ బి రికార్డుల్లో నమోదు చేయాలని అన్నారు. రెవెన్యూ అధికారుల చేత విచారణ చేయించి తమకు న్యాయం చేయాలని ఆ వినతిలో కోరారు.

86వ వార్డు సోషల్ మీడియా కన్వీనర్‌గా శ్రీనివాస్ పట్నాయక్

విశాలాంధ్ర - కూర్మన్నపాలెం: జీవీఎంసీ 86వ వార్డు వైసీపీ సోషల్ మీడియా కన్వీనర్‌గా ఎం.సత్యసాయి శ్రీనివాస్ పట్నాయక్ నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఆయన నియామక పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డికి, ఇన్‌చార్జ్ దేవన్ రెడ్డికి, 86వ వార్డు ఇన్‌చార్జి దామా సుబ్బారావుకి, వార్డు అధ్యక్షుడు మెడికల్ బాబుకి కృతజ్ఞతలు తెలియజేశారు. ఆయనకు వార్డు నాయకులు, కార్యకర్తలు అభిమానులు అభినందనలు తెలిపారు.

జీలుగుకల్లు తాగి మృతి చెందిన కేసులో ముద్దాయి అరెస్టు

చింతపల్లి ఏఎస్పీ ప్రతాప్‌శివకిశోర్

విశాలాంధ్ర - సీలేరు: జీలుగుకల్లు తాగి మృతి చెందిన కేసులో ముద్దాయిని అరెస్టు చేయడం జరిగిందని చింతపల్లి ఏఎస్పీ ప్రతాప్‌శివకిశోర్ వెల్లడించారు. సోమవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ ఇటీవల జీకేవీధి మండలంలోని ఆకులూరు గ్రామంలో జీలుగు కల్లు తాగి లోవరాజు అనే గిరిజన వ్యక్తి మృతి చెందాడని, ఈ మేరకు జీకేవీధి సిఐ అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో సీలేరు ఎస్సై రామకృష్ణ కేసు దర్యాప్తు చేపట్టి మతం త్రినాధరావు సహదేవులకు ఉన్న తగాదాల నేపథ్యంలో త్రినాధరావు అనే వ్యక్తి సహదేవుకు చెందిన జీలుగుచెట్టులో ఉన్న కల్లు కుండలో విషపూరితమైన బుగ్గి చెట్టు పిక్కలు కలిపాడని, ఆ కల్లు తాగి లోవరాజు అనే గిరిజనుడు మృతి చెందినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో సోమవారం ముద్దాయి త్రినాధుని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ సమావేశంలో జీకేవీధి సిఐ అశోక్‌కుమార్, సీలేరు ఎస్సై రామకృష్ణ ఉన్నారు.

20, 21 తేదీల్లో గంగమ్మతల్లి జాతర

విశాలాంధ్ర - ముంచింగిపుట్టు: మండలంలో గల సుజన కోట పంచాయతీ కేంద్రంలో వెలసిన శ్రీ శ్రీ శ్రీ గంగమ్మ తల్లి జాతర మహోత్సవములను ఈనెల 20, 21 తేదీల్లో నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఉత్సవ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు మండి నాగేశ్వరరావు, కూడా మోహన్‌లు తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా పోకెట్ క్యాలెండర్‌ను ఆలయ కమిటీ చైర్మన్, మండల తహశీల్దార్ నర్సమ్మ, ఆలయ కమిటీ అధ్యక్షుడు చేతుల మీదుగా సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామానికి చెందిన సమరెడ్డి బాలగంగాధర్ తిలక్ రోజా రాణి దంపతులు హిందుస్థాన్ షిప్ యార్డ్ వారు ప్రతి ఏడాది ఈ క్యాలెండర్‌ను స్పాన్సర్ చేస్తారని అన్నారు. జాతరకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వి.రమేష్, ఆలయ కమిటీ చైర్మన్, ఆలయ కమిటీ అధ్యక్షుడు ఎం.నాగేశ్వరరావు, సమరెడ్డి ధర్మారావు, వి.నానీబాబు, ఎస్.బాలగంగాధర్ తిలక్, రెవెన్యూ ఇన్స్పెక్టర్ వి.రవికుమార్, టైపిస్ట్ ఎస్.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

కొత్తకోటలో వైఎస్సార్ కంటి వెలుగు

విశాలాంధ్ర - రావికమతం: శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రి, వాసవీ క్లబ్ న్యూ, వనిత క్లబ్ కొత్తకోట వారి సంయుక్త ఆధ్వర్యంలో వైఎస్సార్ ఉచిత కంటి వెలుగు కార్యక్రమం సోమవారం కొత్తకోట పోస్టాఫీస్ సమీపంలో రాజావారి బిల్డింగ్ వద్ద నిర్వహించారు. 100 మంది కంటి రోగులకు పరీక్షలు చేయగా 46 మందిని కంటి ఆపరేషన్‌కు ఎంపిక చేసినట్లు ఫౌండేషన్ ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమంలో శంకర్ ఫౌండేషన్ ఆప్తాలమిక్ ఆఫీసర్ హరి చందన, శంకర్ ఫౌండేషన్ క్యాంపు కో ఆర్డినేటర్ అరుణ్ కుమార్, వాసవీ క్లబ్ ప్రెసిడెంట్ కె.రమేష్, సెక్రటరీ కె.నరేంద్ర, ట్రెజరీ పి.అశోక్, ప్రెసిడెంట్ కె.రామారావు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు

విశాలాంధ్ర - నాతవరం: రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని నాతవరం ఎస్సై లక్ష్మీ నారాయణ అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ మండలంలోని అత్యంత ప్రమాదకర ప్రదేశాల్లో పది బారికేడ్లు ఏర్పాటు చేయడానికి సిద్ధం చేశామన్నారు. ప్రమాదాల నివారణకు అందరూ సహకరిం చాలని, వాహనదారులు నిబంధనలు పాటించాలని సూచించారు.

తెగిపోయిన విద్యుత్ వైర్‌ను సరి చేయాలి

విశాలాంధ్ర - జీకేవీధి: జీకేవీధి మండలం దేవరాపల్లి పంచాయతీ పరిధిలో తెగిపోయిన విద్యుత్ వైర్‌ను తక్షణమే సరి చేయాలని గిరిజన సంఘం మండల కార్యదర్శి గడుతూరి సత్యనారాయణ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ వైర్ తెగిపోవడంతో వల్ల ఏ సమయంలో ఏ ప్రమాదం సంభవిస్తుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారన్నారు. తక్షణమే విద్యుత్ వైర్‌ను సరి చేయాలని డిమాండ్ చేశారు.

వేతనాలందక ఉపాధి కూలీల అవస్థలు

విశాలాంధ్ర - మాకవరపాలెం: చేసిన పనికి వేతనాలు అందకపోవడంతో ఉపాధి కూలీలు ఇబ్బందులు పడుతున్నారు. సుమారు ఏడు వారాలుగా వేతనాలు అందకపోవడంతో వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత డిసెంబరు వరకు వేతనాలు బాగానే అందాయని, ఆ తర్వాత నుంచి తమకు కష్టాలు మొదలయ్యాయన్నారు. మండలంలో మొత్తం 3,700 మంది కూలీలు ఉపాధి పనులను చేస్తుండగా ఇప్పటి వరకు వారికి సుమారు 60లక్షలు వేతన బకాయిలు అందాల్సి ఉంది. దీనిపై ఏపీఓ వరలక్ష్మిని వివరణ కోరగా ఉపాధి పనుల్లో పాల్గొన్న వారందరికీ త్వరలో బకాయిలు చెల్లిస్తామని పేర్కొన్నారు.

శ్రీ లక్ష్మీ గణపతి ఆలయ వార్షికోత్సవం

విశాలాంధ్ర - గోపాలపట్నం: గ్రేటర్ విశాఖ జీవీ ఎంసీ 92వ వార్డు వెంకటా పురం ఎస్సీ, బీసీ కాలనీలోని శ్రీ లక్ష్మీ గణపతి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో 22వ వార్షి కోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. జీవీఎంసీ కోఆప్షన్ మెంబర్ బెహరా భాస్కరరావు స్వామి వారిని దర్శి ంచుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్య క్రమంలో వైసీపీ నాయకురాలు పేడాడ రమణి కుమారి, 91వ అధ్యక్షులు గునిశెట్టి శ్రీనివాసరావు, గేదెల మురళీ కృష్ణ, కంపర కోటేశ్వరరావు, నీలాపు శ్రీనివాసరెడ్డి, కాకి అప్పారావు, మల్లేటి భీమయ్య, ఎద్దు దేవుళ్ళు, కంపర ఆనందరావు, కంపర కనకరాజు, సీరపు శంకరరావు పాల్గొన్నారు.

వసతి గృహాలను ఎంపీడీఓ తనిఖీ

విశాలాంధ్ర - నక్కపల్లి: మండలంలో సోమవారం నక్కపల్లి ఎస్సీ బాలుర వసతి, బీసీ బాలుర, ఏపి రెసిడెన్షియల్ పాఠశాలను ఎంపీడీఓ సీతారామ రాజు, ఎంఈఓ డివిడి ప్రసాద్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. బీసీ బాలుర వసతి గృహంలో పది మంది విద్యార్థులు పాఠశాలలకు వెళ్ళకుండా ఉండటం గమనించి హాస్టల్ వార్డెన్‌ను విచారించారు. పరిసరాలు పరిశుభ్రంగా లేవని, మెనూ ప్రకారం భోజనం అందించడం లేదని విద్యార్థులు ఎంపీడీఓ వద్ద వాపోయారు. నక్కపల్లి ఎస్సీ కాలనీలో పాఠశాలను పరిశీలించి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

విశాలాంధ్ర - ఆనందపురం: జోన్-3 ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పోలాకి శ్రీనివాసరావు ఆదేశాల మేరకు విద్యుత్ మరమ్మతుల కారణంగా మంగళవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈ సురేష్‌కుమార్ తెలిపారు. వేములవలస, ఆనందపురం అన్ని గృహ వాణిజ్య వినియోగదారులకు ఉదయం 09 నుండి మధ్యాహ్నం 02:00 వరకు విద్యుత్ సరఫరా వుండదని తెలిపారు.

రైతులకు దుప్పట్లు పంపిణీ

విశాలాంధ్ర - జి.మాడుగుల: జి.మాడుగుల పోలీసుల ఆధ్వర్యంలో సీఆర్‌పీఎఫ్ 198 బెటాలియాన్ కమాండెంట్ రాజేష్ ఆదేశాల మేరకు సీఆర్‌పీఎఫ్ క్యాంపు ఇన్‌చార్జి డీఎస్పీ రాజా సోమవారం స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో పేద రైతులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐ సత్య నారాయణ, ఎస్ఐ శ్రీనివాస్, సీఆర్‌పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ నానక్ సింగ్, ఎం.వి.రవి, డాక్టర్ శశికాంత్, సర్పంచ్ కె.రాంబాబు, ఎంపీటీసీ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కేజీహెచ్‌లో మెరుగైన సౌకర్యాలు కల్పించాలి

కలెక్టర్ డా.ఎ.మల్లిఖార్జున

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: ప్రతి రోజు వైద్యం కోసం కేజీహెచ్‌కు వచ్చే రోగులతో పాటు వారి సహాయకులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని జిల్లా కలెక్టర్ డా.ఎ.మల్లిఖార్జున అన్నారు. సోమవారం ఉదయం కలెక్టర్ కేజీహెచ్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రోగులతో పాటు వారి సహాయకులకు విశ్రాంతి తీసుకొనేందుకు ఏర్పాటు చేసిన 200 పడకల ఉచిత వసతి భవనాన్ని పరిశీలించారు. రోగులతో పాటు వచ్చే సహాయకులు విశ్రాంతి తీసుకోనేలా మౌళిక వసతులను ఏర్పాటు చేయాలన్నారు. ఎమర్జెన్సీ వార్డుకు వచ్చే రోగుల సహాయకులకు విశ్రాంతి తీసుకొనేందుకు వెయిటింగ్ హాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కె.జి.హెచ్ సూపరింటెండెంట్ డా.అశోక్ కుమార్, ఎ.పి.ఎం.ఐ.డి.సి ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు నాయుడు, డాక్టర్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

నిర్మాణ పనుల్లో జాప్యం చేస్తే ఉపేక్షించం

కలెక్టర్ సుమిత్ కుమార్

విశాలాంధ్ర - పాడేరు: నిర్మాణ పనుల్లో పురోగతి ఉన్నాయి, పనులు జరుగుతున్నాయని ఎంతకాలం చెబుతారని, తాగునీటి పథకాల నిర్మాణాలు జాప్యం చేస్తే తగిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ హెచ్చరించారు. పాడేరు డివిజన్ పరిధిలో జరుగుతున్న తాగునీటి పథకాల నిర్మాణాలపై గ్రామీణ నీటి సరఫరా విభాగం ఇంజనీరింగ్ అధికారులతో సోమవారం ఆయన కార్యాలయంలో మండలాల వారీగా సమీక్షించి మాట్లాడారు. గ్రావిటీ పథకాలు, బోరుబావులు నిర్మాణం పైపులైన్లు పురోగతి, బిల్లు వెబ్సైట్లో నమోదు, వేసవి కార్యచరణ ప్రణాళికలపై ఆరా తీసారు. టెండరు సొంతం చేసుకున్న క్రాంటాక్టర్‌లకు పనులు అప్పగించిన తరువాత నిర్మాణ పనులు చేపట్టక పోతే రాత పూర్వకంగా నోటీస్ జారీ చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. పనులు సకాలంలో పూర్తి చేయలేదని అనంతగిరి మండలం డి.దుంబ్రిగుడ ఎఇలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో 11 మండలాల డిఇఇలు, ఎఇలు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కరాటే పోటీలలో డ్రాగన్ లైన్స్ విద్యార్థుల సత్తా

విశాలాంధ్ర - పరవాడ: రామచంద్రమ్మ అమ్మవారి పండగ సందర్భంగా పరవాడ మండలం వాడచీపురుపల్లిలో నిర్వహించిన 13వ రాష్ట్రస్థాయి కరాటే పోటీలలో స్థానిక డ్రాగన్ లైన్స్ అకాడమీ విద్యార్థులు సత్తా చాటారు. ఈ అకాడమీ నుంచి 15 మంది పాల్గొని కాట, కుమితే విభాగాలలో మొత్తం 26 పతకాలు సాధించారు. ఇందులో సమీక్ష సాహూ, పి.అజయ్ కుమార్, ఎం.కుష్వంత్, ఎన్. ఖ్యాతినాథ్ రెండేసి బంగారు పతకాలు చొప్పున సాధించగా, జి.వంశీ, పి.వివేక్ వర్మ చెరో బంగారు పతకం సాధించారు. అలాగే వి.ఉత్తేజ్, అశ్విన్ అనీష్, జె.దుర్గారావు ఒక్కొక్క బంగారు, రాగి పతకాలు సాధించగా, వి.వర్షిత్, ఎస్.సాయి నారాయణ, ఎం.దేవహర్షిత్ ఒక్కొక్క వెండి పతకాలు సాధించారు. ఇక వి.శ్రీనిధి ప్రియ రెండు రాగి పతకాలు, బి.యశ్వంత్ బి.కాశీనాథ్ చెరో రాగి పతకం సాధించారు. అనంతరం ఆదివారం రాత్రి విజేతలకు మాజీ మంత్రి బండారు సత్యనారాయణ మూర్తి చేతుల మీదుగా పతకాలు అందజేశారు. ఈ సందర్భంగా కోచ్ గొర్లి పుష్పారావుని బండారు అభినందించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మాసవరపు అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

సీఎం, మంత్రుల గూర్చి మాట్లాడే హక్కు అనితకు లేదు

విశాలాంధ్ర - పాయకరావుపేట: ఒకరి గురించి మాట్లాడేటపుడు తాను ఎవరి గురించి మాట్లాడు తున్నానో తెలుసుకోవాలని చెప్పిన మాజీ ఎమ్మెల్యే వంగలపూడి అనిత తాను ఎవరి గురించి మాట్లాడు తున్నారో తెలుసుకొని ప్రవర్తించాలని జెడ్పీటీసీ లంకా సూర్యనారాయణ, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గూటూరు శ్రీనివాసరావు అన్నారు. మంత్రులు దాడిశెట్టి రాజా, గుడివాడ అమర్‌నాథ్‌లపై మాజీ ఎమ్మెల్యే వంగలపూడి అనిత చేసిన విమర్శలను వైసీపీ నాయకులు తీవ్రంగా ఖండించారు. 60 ఏళ్ల రాజకీయ చరిత్ర ఉన్న కుటుంబాల గురించి రంగులు మార్చే అనితకు ఏం తెలుసని ప్రశ్నించారు. 151 సీట్లు గెలుచుకున్న ముఖ్యమంత్రిని సైకో అనడం ఎంత వరకు సమంజసమన్నారు. మంత్రి దాడిశెట్టి రాజా చేస్తున్న సేవా కార్యక్రమాలు గతంలో ఎప్పుడూ ఆ నియోజకవర్గంలో జరగలేదని తెలిపారు. పాయకరావుపేట నియోజకవర్గ నాయకత్వం అనితను తిరస్కరించిన విషయం గుర్తు లేదా అని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ మండల అధ్యక్షులు ధనిశెట్టి బాబూరావు, వైస్ ఎంపీపీ పల్లెల మణికంఠ స్వామి, నాయకులు ఇసరపు తాతారావు, జగతా శ్రీను, పల్యాల లచ్చబాబు, కేశనకుర్తి సత్తిబాబు, వేమగిరి లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌పై గీతం వర్సిటీలో వర్క్‌షాప్

విశాలాంధ్ర - మధురవాడ: ఈ ఏడాది కేంద్ర బడ్జెట్‌పై విద్యార్థులలో అవగాహన కలిగిం చేందుకు గాను గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో సోమవారం ప్రత్యేక వర్క్‌షాప్‌ను నిర్వహించారు. కేంద్ర మాజీ మంత్రి దగ్గుబాటి పురందేశ్వరి ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. రానున్న 25 సంవత్సరాలను భారతదేశ అమృత ఘడియాలుగా పరిగణిస్తూ కేంద్ర ఆర్థిక మంత్రి అన్ని వర్గాల ప్రజలు అభ్యున్నతి చెందేలా బడ్జెట్‌లో కొత్త ప్రకటనలు, కేటాయింపులు చేశారని తెలిపారు. దేశ జనాభాలో 16 నుంచి 33 సంవత్సరాల వయస్సు మధ్య 140 కోట్ల యువజనాభా ఉందని వీరిని దేశ, ప్రపంచ ఆర్థిక రంగంలో భాగస్వామ్యం చేసేలా నైపుణ్యాల పెంపుపై కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో కేటాయింపులు ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ శాసన మండలి సభ్యుడు పి.ఎస్.వి.మాధవ్, ప్రముఖ ఛార్టెడ్ అకౌంటెంట్ లంక దినకర్, గీతం కేంపస్ లైఫ్ ప్రో వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ వై.గౌతమ్‌రావు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డి.గుణశేఖరన్ తదితరులు పాల్గొన్నారు.

వీఎంఆర్‌డీఏ ఉద్యోగులకు వయోపరిమితి పెంపు

విశాలాంధ్ర - విశాఖ : వీఎంఆర్‌డీఏలో ఈ ఏడాది ఉద్యోగ విరమణ చేయనున్నవారిని 62 ఏళ్ళ వయస్సు వరకూ కొనసాగించాలని హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను అమలుచేస్తూ అధికారులు సంబంధిత ఉద్యోగులకు ఉత్తర్వులను ఇస్తున్నారు. జనవరి 31న ఉద్యోగ విరమణ చేయాల్సిన పరిపాలనాధికారి వీవీఎస్‌డీ ప్రసాద్‌ని కొనసాగిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. అయితే కోర్టు తుది ఉత్తర్వులు ఉద్యోగుల ప్రయోజనాలకు వ్యతిరేకంగా వస్తే జీతం డబ్బులను ఉద్యోగ విరమణ తరువాత అందే ప్రయోజనాల నుంచి మినహాయించుకుంటామని అఫిడవిట్లను తీసుకుంటున్నారు. ఈ ఏడాది 14 మంది ఉద్యోగ విరమణ చేయాల్సి ఉండగా, వారందరూ కోర్టును ఆశ్రయించి ఉత్తర్వులు పొందారు. ఎస్‌డీఎం కేవీజే రామారావు, డీఈ ఎం.శ్రీనివాసరాజు, ఏఈ కే.సదా నంద రావు, వర్క్ ఇన్‌స్పెక్టర్ కె.రాంబాబు, డ్రాఫ్ట్‌మేన్ కె.రాంబాబు, డ్రాఫ్ట్‌మేన్ బి.శ్రీరామ్మూర్తి, చైన్‌మేన్ డి.గోపాలరావు, పరిపాలనాధికారి కూన గెద్దయ్య, సీనియర్ అసిస్టెంట్ కె.సూర్య ప్రకాశరావు, అటెండర్ కె.అప్పలనరసమ్మ, చైన్‌మేన్ జి.నూకరాజు, వర్క్ ఇన్‌స్పెక్టర్ ఎం.సత్యనారాయణ, చైన్‌మెన్ కె.గంగా బహదూర్, చైన్‌మేన్ పులి అప్పారావు కోర్టు నుంచి ఉత్తర్వులు పొందారు.

కొన్ని నెలల క్రితం ప్రభుత్వ ఆదేశాల మేరకు 60 ఏళ్ళ వయస్సు నిండి, కొనసాగుతున్న 11 మంది ఉద్యోగులకు అధికారులు ఉద్యోగ విరమణ ఉత్తర్వులు ఇచ్చారు. ఆ తరువాత వారు కోర్టు నుంచి ఉత్తర్వులు తెచ్చుకున్నారు. ఆ ఉత్త ర్వులను అధికారులు ప్రభుత్వానికి పంపారు. ప్రభు త్వం నుంచి సానుకూల ఉత్తర్వులు వస్తే వారిని కొనసాగించే అవకాశాలు ఉండగా కొన్ని రోజులు వారికి అనుకూలంగా ఉత్తర్వులు రావచ్చని భావిస్తున్నారు.

పురిల్లు దగ్ధం

విశాలాంధ్ర - యస్.రాయవరం: మండలంలోని తిమ్మాపురం గ్రామ శివారు కోనవానిపాలెం గ్రామంలో పురిల్లు దగ్ధమైంది. వివరాల్లోకి వెళ్తే సోమవారం కొర్ని గురువులమ్మ పూరిల్లు విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మంటలు వ్యాపించి పూర్తిగా దగ్ధమైంది. విషయం తెలుసుకున్న గ్రామ సర్పంచ్ కర్రి సత్యనారాయణ, నాగబోయిన శ్రీను, వార్డు మెంబర్ సింహాద్రి యాదవ్ సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. వెంటనే సర్పంచ్ 25 కేజీల బియ్యం, నిత్యావసర సరుకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వీఆర్‌ఓ నూకరాజు, నాయకులు కోన దుర్గ బాబు, సత్తిబాబు, గోవిందు పాల్గొన్నారు.

షేక్ జిన్నా సాహెబ్ కుటుంబానికి ఆర్థికసాయం

విశాలాంధ్ర - మునగపాక: షేక్ జిన్నా సాహెబ్ కుటుంబానికి సిరసపల్లి సర్పంచ్ మద్దాల నాగ అప్పారావు 3 వేలు, అలాగే స్టేట్ టైలర్ సంఘం అధ్యక్షుడు వెంకటేశ్వర రెడ్డి 2 వేలు మొత్తం 5వేల రూపాయలు రత్నబీబీకి శ్రీ వీరభద్ర టైలర్ అసోసియేషన్ ద్వారా అందించారు. ఈ కార్యక్రమంలో టైలర్ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు ఆళ్ల వెంకటరావు, షేక్ ఇస్మాయిల్, కాంద్రేగుల వెంకటలక్ష్మి, అప్పికొండ శివ, రామచంద్రరావు, వానపల్లి అప్పలరాజు, సూరిశెట్టి వీరబాబు, దాడి శ్రీను, పెంటకోట శివాజీ, దాక్షరపు రామకృష్ణ, దొడ్డి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

జగనన్న కాలనీ పేరుతో ప్రభుత్వ భూమి కబ్జా

కలెక్టర్‌కి సీపీఐ జిల్లా నేత దొరబాబు ఫిర్యాదు

విశాలాంధ్ర - అనకాపల్లి: అనకాపల్లి మండలం బోలివాడ రెవెన్యూ పరిధిలో సర్వే నెంబర్ 4, 75 లో ప్రభుత్వం కబ్జా చేసి జగనన్న ఇళ్ల పేరుతో పేదలకు అమ్మకాలు చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి దొరబాబు డిమాండ్ చేశారు. ప్రభుత్వం కబ్జా చేయడమే కాకుండా లక్షలాది రూపాయలు విలువైనటువంటి గ్రావెల్ తవ్వకాలను ఎలాంటి అనుమతులు లేకుండా చేస్తున్నప్పటికీ రెవెన్యూ అధికారులు కనీస చర్యలు చేపట్టకపోవడం దారుణమన్నారు. ఆక్రమదారులతో కుమ్మక్కవడం వల్ల ప్రభుత్వానికి తీవ్ర నష్టం జరుగుతుందని దొరబాబు విమర్శించారు. ఈ మేరకు కలెక్టర్‌కు ఆయన ఫిర్యాదు చేశారు. అధికార పార్టీ నేతలు, మండల రెవెన్యూ అధికారుల ప్రమేయంతోనే ప్రభుత్వ భూమి కబ్జా గ్రావెల్ దందా నిర్వహిస్తున్నారని దొరబాబు ఆరోపించారు. రెవెన్యూ అధికారుల దృష్టికి సమస్య తీసుకెళ్ళినప్పటికీ పరిష్కరించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని విమర్శించారు.

బస్సు కింద పడి వ్యక్తి మృతి

విశాలాంధ్ర - కొయ్యూరు: దిగుతున్న బస్సు కదలడంతో బస్సు వెనుక చక్రాల కింద పడి వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్సై రాజారావు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని చింతలపూడి పంచాయతీ లుబ్బర్తి గ్రామానికి చెందిన తూబే సన్యాసిరావు (53) గూడెం కొత్త వీధి మండలంలో చదువుతున్న కుమార్తెను చూడడానికి ఆదివారం ఉదయం వెల్లాడు. తిరుగు ప్రయాణంలో పాడేరు - మంప బస్సు ఎక్కాడు. బస్సు దిగే సమయంలో డ్రైవర్ ఒక్కసారిగా బస్సును ముందుకు నడపడంతో సన్యాసిరావు వెనుక చక్రాల కింద పడి తీవ్ర గాయాల పాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కొయ్యూరు ఎస్సై రాజారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

అధికారుల నిర్లక్ష్యం...తాగునీరు వృథా

విశాలాంధ్ర - పెందుర్తి: అధికారుల నిర్లక్ష్యం కారణంగా భారీగా తాగునీరు వృథా అయిన ఘటన జీవీఎంసీ 95వ వార్డు లక్ష్మీపురంలో చోటు చేసుకుంది. సోమవారం ఉదయం లక్ష్మీపురం కూడలిలో యూజీడీ పైపులైన్ కోసం తవ్వకాలు జరుపుతుండగా భూమిలో వున్న తాగునీటి పైపులైను పగిలి భారీగా నీరు వృథాగా పోయింది. దాదాపు 10 అడుగుల ఎత్తున నీరు ఎగిసిపడింది. దీంతో రాకపోకలకు ప్రయాణీకులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. దీనిపై స్థానికులు తీవ్ర స్థాయిలో మండి పడుతున్నారు. యూజీడీ పైపులైను కోసం తవ్వకాలు జరుపుతున్న అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని, కనీసం భూమి లోపల ఏముందో తెలుసుకోకుండానే పనులు చెయ్యడమేమిటని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టి ప్రజలకు ఇబ్బంది లేకుండా, ప్రజాధనం, మౌలిక సదుపాయాలు వృథా కాకుండా యుజిడి పనులు చేపట్టాలని కోరారు.

అంబేద్కర్ విగ్రహ స్థలాన్ని ఆక్రమిస్తే ఉపేక్షించం

విశాలాంధ్ర - అచ్యుతాపురం: డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహ స్థలాన్ని ఆక్రమిస్తే ఉపేక్షించేది లేదని రిపబ్లిక్ పార్టీ ఆఫ్ ఇండియా వైస్ ప్రెసిడెంట్ జిల్లా అంబేద్కర్ మెమోరియల్ సొసైటీ అధ్యక్షులు బొడ్డు కళ్యాణరావు హెచ్చరించారు. అచ్యుతాపురం రహదారి నుండి భోగాపురం వెళ్ళే కూడలిలో ఏర్పాటు చేసిన అంబేద్కర్ విగ్రహ స్థలాన్ని కొందరు వ్యక్తులు ఆక్రమణకు గురిచేయడం అన్యాయ మన్నారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ మెమోరియల్ ఉపాధ్యక్షులు ఇంటి గురుమూర్తి, నీలపు శ్రీనువాసరావు, బొడ్డు పెద్ది నాయుడు, బీలా అప్పారావు, తట్టా రాజు, రాహుల్, రేవిడి కృష్ణ, ఊషా చిట్టిబాబు, తట్టా అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తరాంధ్ర ఆర్.ఎం.పి జోనల్ సహాయ కార్యదర్శిగా అమిత్ కుమార్

విశాలాంధ్ర - చోడవరం: ఉత్తరాంధ్ర సామాజిక గ్రామీణ వైద్యులు (ఆర్.ఎం.పి) సంక్షేమ సంఘం జోనల్ సహాయ కార్య దర్శిగా బుచ్చియ్యపేట మండలం విజయ రామరాజుపేట గ్రామానికి చెందిన గ్రామీణ వైద్యుడు దొడ్డి అమిత్ కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అలాగే జోనల్ ఈసీ మెంబర్‌గా దేవరాపల్లి మండలం కలిగట్ల గ్రామానికి చెందిన రాపేటి ఆదినారాయణ ఎన్నికయ్యారు. చోడవరంలో సంజీవని ఆసుపత్రి ఆవరణలో జరిగిన సమావేశంలో డాక్టర్ ఆదారి చంద్రశేఖర్, డాక్టర్ త్రిలోక్ చంద్, డాక్టర్ బండారు బాలకృష్ణ, డాక్టర్ సోనియా, డాక్టర్ నిరుపమ, జోనల్ అధ్యక్షులు జంగం జోషి, గౌరవా ధ్యక్షులు మమ్ముల తిరుపతిరావు, కార్యదర్శి సుగు ణేశ్వరి, ఫెంపా రాష్ట్ర సలహాదారు డాక్టర్ ఎన్.ఎల్.రావులు హాజర య్యారు. కార్యక్రమంలోఅల్లాడ త్రినాధ రావు, కనకారావు, ఆకుల శ్రీనివాస్, వెంకట్రావు, లోగిషా గణేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యాన పంటలపై అవగాహన కల్పించండి

విశాలాంధ్ర - దేవీపట్నం: ఏజెన్సీలోని ఉద్యానవన పంటలు సాగు చేసే రైతులకు వాటిపై అవగాహన కల్పించే బాధ్యత సంబంధిత అధికారులపై ఉందని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సూరజ్ గనోరే సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక ఐటీడీఏ కార్యాలయ సమావేశపు హాలులో ఉద్యానవన పంటలకు సంబంధించిన డైరీని ఆయన ఆవిష్క రించారు. సంబంధిత అధికారులకు, సిబ్బందికి డైరీలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్ హార్టికల్చర్ అధికారి కె.చిట్టిబాబు, ప్రాజెక్ట్ అగ్రికల్చరల్ అధికారి రాంబాబు, హార్టికల్చర్ అధికారి యన్.రమేష్ పాల్గొన్నారు.

పందుల నిర్మూలనకు స్పెషల్ డ్రైవ్

విశాలాంధ్ర - పెదగంట్యాడ: జీవీఎంసీ పరిధిలో గల 75వ వార్డులో డాక్టర్ కిషోర్ కుమార్ ఆధ్వర్యంలో పందుల నిర్మూలనకు స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. పందుల వలన ప్రజలు అనారోగ్యం బారిన పడకుండా ఎప్పటికప్పుడు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నామని అన్నారు. ప్రజలు కూడా తమకు సహకరించాలని అన్నారు. కిషోర్ కుమార్ మాట్లాడుతూ పందుల పెంపకందార్లుకు ఎన్ని సదుపాయాలు కల్పించిన యథాతదంగా ఊరిపైకి విడిచిపెడుతున్నారని అన్నారు. ఈ స్పెషల్ డ్రైవ్‌లో జోనల్ కమిషనర్ సింహాచలం, ఏహెచ్ ఓ కిరణ్ కుమార్, నవీన్ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

కుష్ఠు వ్యాధిగ్రస్తులకు రగ్గులు పంపిణీ

విశాలాంధ్ర - పద్మనాభం: మండలంలో రేవిడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జాతిపిత మహాత్మా గాంధీ 75వ వర్ధంతి పురస్కరించుకొని జనవరి 30 నుండి ఫిబ్రవరి 13 వరకు స్పర్శ కుష్టి వ్యాధి అవగాహన కార్యక్రమంలో భాగంగా ఉచిత శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కుష్ఠు ఎయిడ్స్ అధికారి డాక్టర్ పూర్ణేంద్రబాబు మాట్లాడుతూ ఈ వ్యాధులు సోకే వారిని వివక్షతో చూడకుండా సానుభూతితో ప్రేమతో చూడాలని అప్పుడే వాళ్ళు తొందరగా కోలుకోవడానికి అవకాశం ఉంటుందని అన్నారు. మానవత సేవ చారిటబుల్ ట్రస్ట్ విశాఖపట్నం వారు 50 మంది అంగవైకల్యం గల కుష్ఠు వ్యాధిగ్రస్తులకు రగ్గులు, అల్సర్ కిడ్స్, ఎం సి ఆర్ చెప్పులు అందించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రాథమిక వైద్యాధికారి స్వప్న అదితి, డాక్టర్ రామిరెడ్డి, శాంత కుమారి, డిపిఎమ్ఓ భీమేశ్వరరావు, ఎంపి హెచ్ఇఓ శ్రీనివాసరావు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

దివ్యాంగుల పట్ల వివక్ష లేని సమాజాన్ని నిర్మిద్దాం

విశాలాంధ్ర - రావికమతం: దివ్యాంగ పిల్లలు ఏ ఇతర పిల్లలకూ తక్కువ కాదని వారిలో ఆత్మవిశ్వాసాన్ని నింపి ఇతర పిల్లలతో సమానంగా అన్ని విషయాల్లో ముందుకు నడిపేందుకు 'సహిత క్లబ్'లను ఏర్పాటు చేయడం జరిగిందని మేడివాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎం.జయలక్ష్మి అన్నారు. సోమవారం మేడివాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని సహిత విద్యా విభాగం ప్రత్యేక ఉపాధ్యాయులు మహాలక్ష్మి నాయుడు ఆధ్వర్యంలో సహిత క్లబ్‌లను ఏర్పాటు చేసి సాధారణ విద్యార్థులతో పాటు దివ్యాంగ విద్యార్థులకు పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు అప్పలనాయుడు, గోవిందరావు, ప్రత్యేక ఉపాధ్యాయులు మహాలక్ష్మి నాయుడు, జగన్నాథం నాయుడు తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీల్లో కానరాని పారిశుధ్యం

విశాలాంధ్ర - చోడవరం: చోడవరంతో బాటు మండలంలోని పలు గ్రామ పంచాయతీల్లో అపారిశుధ్యం తాండవిస్తోంది. డ్రైనేజీ లేక కొంత సమస్య అయితే, వున్న డ్రైనేజీలు శుభ్రం చేయించేందుకు పంచాయతీల్లో నిధులు లేమితో అసలు సమస్యలు మొదలయ్యాయి. దీంతో అంటు వ్యాధులతోనే ప్రజలు సహవాసం చేయాల్సిన పరిస్థితి దాపురించింది. మండలం లోని లక్ష్మీపురంలో డ్రైనేజీలు సమస్య అధికంగా ఉండడంతో అంటు వ్యాధులు కలిగించే క్రిమి కీటకాలు ఇంట్లోకి వస్తున్నాయని మాజీ సర్పంచ్ చింతల దేవ నాగ ఎర్రునాయుడు ఆరోపిస్తున్నారు. తమ పాలనలో ఎప్పటికప్పుడు పారిశుధ్యం కోసం, ప్రజారోగ్యం కోసం శ్రమించే వారమని తెలిపారు.

ఎప్పటికప్పుడు డ్రైనేజీలు శుభ్రం, త్రాగు నీరు క్లోరినేషన్ చేసేవారమని అన్నారు. పంచాయతీల్లో నిధులు లేమితో ఎటువంటి పనులు చేపట్టక పోవడంతో, కొత్తగా ఎన్నికైన సర్పంచ్‌లు ముఖం చాటేస్తున్నారని తెలిపారు. గ్రామాల్లో వాలంటీర్‌లకు ఇచ్చే గౌరవాన్ని కూడా సర్పంచ్‌లు పొందలేక తీవ్ర ఆత్మ క్షోభ అనుభవిస్తున్నారని అన్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి డ్రైనేజీ, క్లోరినేషన్ సమస్యలు తీర్చాలని, ప్రజారోగ్యాన్ని కాపాడవలసినది గా లక్ష్మీపురం మాజీ సర్పంచ్ దేవ నాగ ఎర్రు నాయుడు డిమాండ్ చేస్తున్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

విశాలాంధ్ర - రావికమతం: కొత్తకోట విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో మంగళవారం విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్టు డీఈఈ జి.సురేష్ బాబు తెలిపారు. మంగళవారం ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకూ కొత్తకోట, టి.అర్జా పురం, దొండపూడి, జే. నాయుడు పాలెం, కన్నంపేట, జెడ్ కొత్తపట్నం, గంప వానిపాలెం, కల్యాణపులోవ తదితర గ్రామాలలో విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్టు తెలిపారు.

చింతపల్లి ఏరియా ఆసుపత్రిలో శస్త్ర చికిత్స

విశాలాంధ్ర - చింతపల్లి : ఎట్టకేలకు చింతపల్లి ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ ఆదిత్య కీర్తి శస్త్ర చికిత్సలకు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా సోమవారం కొయ్యూరు మండలం గింజర్తి గ్రామానికి చెందిన పోలోజు జ్యోతి అనే గర్భిణీకి గైనకాలజిస్ట్ సుధా శారదతో కలిసి శస్త్ర చికిత్స నిర్వహించారు. ఈ శస్త్ర చికిత్సలో గర్భిణీ జ్యోతి ఆడబిడ్డకు జన్మనిచ్చింది. తల్లి, బిడ్డ ఆరోగ్యంగా ఉండడంతో ఆస్పత్రి వర్గాలతో పాటు జ్యోతి కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. మునుపెన్నడు ఈ ఆసుపత్రిలో శస్త్ర చికిత్సల నిర్వహణ లేదు. నిపుణులైన వైద్యులు, మత్తు వైద్యాధికారి నియామకంతో శస్త్ర చికిత్సలు నిర్వహించేందుకు ఆసుపత్రి సూపరింటెండెంట్ ఆదిత్య కీర్తి చొరవ తీసుకున్నారు. దీంతో ఎట్టకేలకు జ్యోతి అనే గర్భిణీకి శస్త్ర చికిత్స నిర్వహించి వైద్యులు సఫలీకృతం అయ్యారు. ఈ శస్త్ర చికిత్స కార్యక్రమంలో మత్తు వైద్యాధికారి రమేష్, సిబ్బంది పాల్గొన్నారు.

వైసీపీ రద్దు చేసిన పథకాలను కొనసాగించాలి

విశాలాంధ్ర - పాడేరు: రాష్ట్రంలో వైసీపీ సర్కార్ రద్దు చేసిన 26 ఎస్సి ఎస్టీ సంక్షేమ పథకాలు కొనసాగించాలని బీజేపీ ఎస్టీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు కురుసా ఉమా మహేశ్వర రావు డిమాండ్ చేశారు. సోమవారం అల్లూరి జిల్లా కలెక్టరేట్ వద్ద బీజేపీ ఎస్సి మోర్చా జోనల్ (కోనసీమ) ఇంచార్జి పెనుమాక రవికుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన 24 గంటల నిరాహార దీక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం దారి మళ్ళించిన సంక్షేమ పథకాల నిధులు ఎస్సి ఎస్టీల అభివృద్ధి కొరకు నిధులను ఖర్చు చెయ్యాలని డిమాండ్ చేశారు. అంబేద్కర్ విదేశి విద్యా స్కీమ్, ప్రధాన మంత్రి ఆదర్శ్ గ్రామ యోజన, స్టాండప్ ఇండియా, ఎస్సి ఎస్టీ బ్యాక్ లాగ్ పోస్టులు భర్తీ తక్షణమే చెయ్యాలన్నారు. దీక్ష అనంతరం జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మెమోరాండం అందజేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు పాంగి రాజారావు, శాంతి కుమారి, కృష్ణ రావు, దుర్గారావు వేమనబాబు, ఆనంద్ , రామకృష్ణ, రాఘవేంద్ర రావు, రవి చంద్ర, స్వప్న కుమారి, గోపాల పాత్రుడు, భాస్కర్ రావు, మత్స్య కొండ బాబు, శ్రీనివాసరావు, సత్యవతి, కళావతి, రామ్ చంద్ర, కిల్లో ఆనంద్, ఆనంద్, సతీష్ వడాల్, గాసన్న తదితరులు పాల్గొన్నారు.

స్టింగ్ నూతన ప్రచారం విడుదల

విశాలాంధ్ర - విశాఖ సిటీ: పెప్సికో ఇండియాకు చెందిన స్టింగ్, భారతదేశ యువతను ఉత్తేజపరిచే శక్తితో గొప్ప ఉత్సాహం యొక్క స్టింగ్ నేడు తమ నూతన ప్రచారాన్ని బ్రాండ్ అంబాసిడర్ సూపర్‌స్టార్ అక్షయ్‌కుమార్‌తో విడుదల చేసింది. ఈ ప్రచారం ఈ వేసవిలో వీక్షకులను ఆకట్టుకుంటూ అత్యంత చమత్కారమైన, ఉత్సాహపూరితమైన చిత్రంతో రానుంది. ఇది బ్రాండ్ యొక్క 'ఎనర్జీ బోలే తో స్టింగ్' అనే నమ్మకాన్ని ప్రతిధ్వనించేలా వుంటుందని ఆ సంస్థ ప్రతినిధి చెప్పారు. ఈ చిత్రం ఓ కళాశాలలోని రసాయన ల్యాబ్‌లో ప్రారంభమవుతుందని అక్షయ్‌కుమార్ స్టింగ్‌ని ఉపయోగించేలా నటించారన్నారు.

ధాన్యం సొమ్ము చెల్లించాలి

విశాలాంధ్ర - రాజవొమ్మంగి: మండలం దూసరిపాము గ్రామానికి చెందిన రైతులు ధాన్యం సొమ్ములు చెల్లించాలంటూ స్థానిక రైతుభరోసా కేంద్రం వద్ద ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్బీకే ద్వారా ధాన్యం అమ్మి సుమారు నలభై రోజులు కావస్తున్నా ఇప్పటివరకు డబ్బు రాకపోవడంతో వ్యవసాయం కోసం చేసిన అప్పులు వడ్డీలు పెరుగుతున్నాయని, కూలీలకు పని చేసిన సొమ్ములు అడుగుతుంటే వారికి కనపడకుండా తిరుగుతున్నామని వాపోయారు. వెంటనే తమ డబ్బు అకౌంట్లో పడేలా చూడాలని వ్యవసాయాధికారి రమేష్ నాయుడిని కోరారు.

15న ఉచిత కంటి వైద్య శిబిరం

విశాలాంధ్ర - మారేడుమిల్లి: మండల కేంద్రమైన మారేడుమిల్లిలో వీఆర్ పురం మండలం రేఖపల్లికి చెందిన అలోక విజన్ ప్రోగ్రాం వ్యవసాయ, సాంఘిక అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 15వ తేదీన ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్టు ఆ సంస్థ నిర్వాహకులు వి.నాగరాజు, రాజ్ కుమార్‌లు తెలిపారు. ఈ శిబిరంలో కంటి పరీక్షలతో పాటు ఆపరేషన్ తప్పనిసరి అని గుర్తించిన వారికి కంటి ఆపరేషన్‌కు తగిన ఏర్పాట్లు చేస్తామని పేర్కొన్నారు.

షిరిడి సాయి ఆలయ వార్షికోత్సవం

విశాలాంధ్ర - చింతూరు: మండల కేంద్రంలోని సినిమా హాల్ బజారులో నెలకొని ఉన్న విఘ్నేశ్వర దత్తాత్రేయ సహిత సాయి బాబా ఆలయం పదో వార్షికోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం కాగడా హారతి, పంచామృతాభిషేకాలు, గణపతి పూజ, పుణ్యవచనం, భద్ర మండల ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం మహాఅన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

నల్లగొండమ్మ ఆలయంలో చోరీ

విశాలాంధ్ర - నాతవరం: నాతవరం మండల తాండవ ప్రాజెక్టు వద్ద గల శ్రీశ్రీ నల్లగొండమ్మ అమ్మవారి ఆలయంలో ఆదివారం అర్ధరాత్రి దొంగలు పడ్డారు. వారు ఆలయంలో ఉన్న సిసి కెమెరా రికార్డు చేసే మోనిటర్ పట్టుకుపోయారు. అలాగే ఆలయంలో ఉన్న రెండు హుండీలను పగులకొట్టి భక్తుల కానుకలు కింద వేసిన నగదును దొంగిలించారు. ఈ హుండిలను దూరంగా తీసుకువెళ్లి అటవీ ప్రాంతంలో వదిలి పెట్టి వెళ్లిపోయారు. ఆలయ కమిటీ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

10వ తరగతి విద్యార్థులకు స్టడి మెటీరియల్ పంపిణీ

విశాలాంధ్ర - నాతవరం: విద్యకు తమ వంతు సహకారం అందించేందుకు ముందుంటామని సెంటీరియస్ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ డైరెక్టర్ కెఎస్.మూర్తి అన్నారు. నాతవరం ఎస్సీ బాలుర వసతి గృహంలో పదో తరగతి

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేశారు. ఈ సందర్భంగా మూర్తి మాట్లాడుతూ వార్డెన్ రొంగలి విద్యార్థుల పట్ల ప్రత్యేకమైన శ్రద్దను చూసి తమ వంతుగా ఆల్ ఇన్ వన్ గైడులను అందజేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌వైసి సేవా సంస్థ ప్రతినిధి కె.జీవన్‌తిమోతి, విద్యా కమిటీ చైర్మన్ రెడ్డి వరహాలబాబు పాల్గొన్నారు.

తల్లిదండ్రులను కనికరించని కన్న బిడ్డలు

విశాలాంధ్ర - పాయకరావుపేట రూరల్: కని పెంచిన తల్లిదండ్రులను చివరి దశలో బాధ్యతగా చూసుకోవాల్సిన కన్నబిడ్డలు కనీసం కనికరం లేకుండా వదిలేసిన సంఘటన పాయకరావుపేటలో చోటుచేసుకుంది. తమకి న్యాయం చేయమంటూ దుర్గా నగర్‌కి చెందిన ఆకుల సత్యవతి భర్త వెంకటేశ్వరరావు రెవెన్యూ ఇన్స్పెక్టర్ ఉద్ధవరావు కి వినతి పత్రం అందజేశారు. ఒకప్పుడు బాగా బ్రతికి ఇప్పుడు కొడుకులు పట్టించుకోక దీన స్థితిలో ఉన్నామని, తన భర్త సంపాదించిన ఇంటిని సర్వే చేసి రిపోర్ట్ ఇవ్వాల్సిందిగా కోరారు. తమకు రావాల్సిన అద్దెలు వసూలు చేసుకుంటూ అడిగితే బెదిరిస్తున్నారని వాపో యారు. అధికా రులు చర్య తీసుకొని తమకు తగిన న్యాయం చేయాలని కోరారు.

మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలి

విశాలాంధ్ర - పాయకరావుపేట: మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని సీఐ పి.అప్పలరాజు సూచించారు. పట్టణంలోని ఆదిత్య ఐటిఐ కళాశాలలో విద్యార్థులకు మత్తు పదార్థాలపై అవగాహన కల్పించారు. డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్ దిశగా యువతా మేలుకో, భవితను మలచుకో, డ్రగ్స్ వదులుకో అనే ఫెక్సీను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీఐ అప్పలరాజు మాట్లాడుతూ మత్తు పదార్థాలు సేవించడం వలన మనిషి కేంద్ర నాడీ వ్యవస్థపై ప్రభావం చూపుతుందని తెలిపారు. దీని కారణంగా వ్యక్తి విచక్షణా గుణం కోల్పోతారని శరీరంలో అవయవాలు చెడిపోతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు రమేష్, జోగారావు, ఆదిత్య ఐటిఐ ప్రిన్సిపాల్ నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

క్వారీకి అనుమతులు ఇవ్వొద్దు: గ్రామస్తుల నిరసన

విశాలాంధ్ర - రావికమతం: క్వారీకి అనుమతులు ఇవ్వొద్దని మరుపాక గ్రామస్తులు అనకాపల్లి జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద సోమవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ గ్రామం లో సర్వే నెంబర్ 258 బ్లాక్ మెటల్ క్వారీకి బీఎంజే అప్పారావు కంపెనీ దరఖాస్తు చేసుకున్న విషయం తెలిసిందే. ఈ మేరకు ఈనెల 10న క్వారీ అనుమతులు మంజూరులో అభ్యం తరాలు తెలుసుకొనుటకు డీఆర్‌ఓ వెంకటరమణ మరుపాకలో గ్రామసభ నిర్వహించారు. అయితే గ్రామ సభకు సంబంధించి గ్రామంలో అర్ధరాత్రి దండోరా వేయించారని , ఈ గ్రామ సభలో ఇతర గ్రామాల నుంచి రైతులను దిగుమతి చేసుకొని క్వారీకి అనుకూలంగా మాట్లాడించారని మరుపాక గ్రామస్తులు లిఖిత పూర్వకమైన ఫిర్యాదును అందజేశారు. క్వారీకి అనుమతి ఇచ్చినట్లయితే 300 కుటుంబాలకు చెందిన రైతులు వ్యవసాయం, పాడి పరిశ్రమకు దూరమై వీధిన పడతామని తెలిపారు.

ఐటీడీఏ స్పందనకు సమస్యల వెల్లువ

విశాలాంధ్ర - దేవీపట్నం: రంపచోడవరం ఐటీడీఏ పీఓ సూరజ్ గనోరే, సబ్ కలెక్టర్ శుభం బన్సల్, ఎంపీడీఓ జనరల్ సిహెచ్ శ్రీనివాసరావులు సంయుక్తంగా స్థానిక ఐటీడీఏ సమావేశపు హాల్లో నిర్వహించిన స్పందనకు సమస్యలు వెల్లువెత్తాయి. వై.రామవరం మండలం ఎగువ ప్రాంతమైన కొప్పులకోట గ్రామంలో పదిమంది కుటుంబాలకు సంబంధించిన 50 ఎకరాలకు సాగునీరు అందించే విధంగా చెక్ డాం ఏర్పాటు చేయాలని తదితర వినతులు అందించారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు నాగేశ్వరరావు, ఎండి యూసఫ్, ఏపీడీ వెలుగు ఎ.శ్రీనివాసరావు. పిహెచ్‌ఓ కె.చిట్టిబాబు, డీఎల్‌డీఓ కె.కోటేశ్వరరావు, ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కల్పన, డాక్టర్ రాధిక, పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాసరావు, జీసీసీ మేనేజర్ యం.నాగరాజా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శ్రీ చైతన్య పాఠశాలలో స్పోర్ట్స్ మీట్

విశాలాంధ్ర - పెందుర్తి: శ్రీ చైతన్య టెక్నో స్కూల్ పెందుర్తి బ్రాంచ్ నందు సోమవారం స్పోర్ట్స్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రదర్శించబడిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. పాఠశాల ప్రాంతీయ పర్యవేక్షణ అధికారి వై.ఆశిబాబు విద్యార్థులలో శారీరక, మానసిక పెరుగుదలకు క్రీడలు ఎంతగానో దోహదపడతాయని, క్రీడల ద్వారా శారీరక దారుద్యాన్ని విద్యార్థులందరూ పెంపొందించుకోవాలని సూచించారు. ప్రధానోపాధ్యాయులు పి.తారకేశ్వరరావు మాట్లాడుతూ శ్రీ చైతన్య యాజమాన్యం విద్యార్థులను అన్ని విధాలుగా బలోపేతం చేసే కార్యక్రమాలను చేపట్టి ప్రోత్సహిస్తోందని పేర్కొన్నారు. కార్యక్రమంలో విద్యార్థులకు పతకాలు, యోగ్యత పత్రాలు అందజేశారు. విజేతలకు ఉత్తరాంధ్ర పాఠశాలల ఏజీఎం ఎం.వి సురేష్, జోనల్ అకాడమిక్ కోఆర్డినేటర్ ఎల్.రాజేష్ అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అకాడమిక్ డీన్ పి.రవి కుమార్, సి బ్యాచ్ ఇంచార్జ్ ఎం.ఆర్.వి శేషగిరి, అసిస్టెంట్ డీన్ ఎస్ వి గోవిందరావు, ప్రైమరీ ఇంచార్జ్ ఎస్. రాజ్యలక్ష్మి, ప్రీ ప్రైమరీ ఇన్చార్జ్ టి.శోభ సిబ్బంది పాల్గొన్నారు.

వాస్తవాలను తెలుసుకోవాలి: అసకపల్లి సర్పంచ్

విశాలాంధ్ర - పెందుర్తి: వీఆర్వోను దూషించామనడం అబద్ధమని వాస్తవాలను తెలుసుకోవాలని సబ్బవరం మండలం అసకపల్లి సర్పంచ్ కర్రి నరసింగరావు స్పష్టం చేశారు. వీఆర్వోను దూషించారంటూ సర్పంచ్ కర్రి నరసింగరావుపై కేసు నమోదైన విషయం తెలిసిందే. సోమవారం ఉదయం గ్రామస్తులతో పాటు తహశీల్దారును కలిసి వినతిపత్రం సమర్పించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ తమ పంచాయతీలోని అసకపల్లి ఎర్రవాని పాలెం గ్రామాలకు చెందిన పలువురప యాదవ కులస్తులు గుడిసెలు వేసుకుని జీవిస్తున్నారని తెలిపారు. అయితే ఆ స్థలాల్లో శాశ్వతంగా ఉండేందుకు రేకుల షెడ్లు వేసుకునేందుకు ప్రయత్నించగా వీఆర్‌ఓ అక్కడికి వచ్చి షెడ్లను తొలగింగించాలంటూ పరుష పదజాలంతో నిరుపేదలను దూషించారని సర్పంచ్ చెప్పారు. ఈ విషయం తెలుసుకున్న తాను అక్కడికి వెళ్లి పేదలను ఇబ్బంది పెట్టవద్దని విఆర్‌ఓను అభ్యర్ధించానని, అంతే తప్ప ఆమెను దూషించలేదని పేర్కొన్నారు. విఆర్‌ఓను దూషించినట్లు తహశీల్దార్‌కు ఆమె ఫిర్యాదు చేయడం ఆశ్చర్యం కలిగించిందని వాపోయారు. దీనిపై సమగ్ర విచారణ జరిపి న్యాయం చేయాలని ఆయన తహసీల్దార్‌కు విజ్ఞప్తి చేసారు. ఇదిలా ఉండగా సర్పంచ్ తో పాటు గ్రామానికి చెందిన పలువురు యాదవ్ కుటుంబాలవారు తమ నిర్మాణాలకు అడ్డు పెట్టవద్దని తహసీల్దార్‌కు మరో వినతి పత్రం సమర్పించారు.

ఉపాధ్యాయుల గైర్హాజరుపై చర్యలు చేపట్టండి

విశాలాంధ్ర - పాడేరు: అల్లూరి జిల్లాలో పిల్లలకు విద్యా బుద్ధులు నేర్పి వారిని జాతికి అంకితం చేయాల్సిన ఉపాధ్యాయులే విధులకు దుమ్మా కొడుతూ స్వంత పనులు చక్కపెట్టుకుంటున్నట్టు ఆధారాలతో పాటు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్‌కు కోకొల్లలుగా ఫిర్యాదులు అందుతున్నాయని ఆటువంటి వారిని చూస్తూ ఉపేక్షించేది లేదని ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం, కుమారి ఆదిలక్ష్మి త్రిపర్ణ అన్నారు. సోమవారం జిల్లా విద్యా శాఖాధికారులతో పాడేరు కాఫీ హౌస్‌లో సమీక్ష నిర్వహించి మాట్లాడారు. అల్లూరి జిల్లాలోని అన్ని శాఖల సమన్వయంతో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ బాలలను మత్తు పదార్థాలు, వ్యసనాలకు గురిచేస్తున్న వారిపై కఠిన చర్యలు చేపట్టేలా ప్రణాళికా యుతంగా వ్యవహరించాలని అన్నారు. బాలల, విద్యార్థుల జీవితాలను ఛిద్రం చేస్తున్న మత్తు పదార్థాలు, బాలల అక్రమ రవాణా వ్యవహారాలపై రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ డేగ కళ్ళతో పర్యవేక్షణ జరుపుతోందన్నారు. వీటికి దూరంగా ఉంచుతూ వారి బంగారు భవితకు ఎటువంటి చర్యలు తీసుకుంటే వాటిని విడనాడి పయనిస్తారో ఆయా అంశాలను ప్రభుత్వానికి, జిల్లా ఉన్నతాధికారులకు ఆదేశాలు, సూచనలు రూపంలో అందిస్తున్నామన్నారు. ఈ సమావేశంలో జిల్లా బాలల సంక్షేమ సమితి సభ్యురాలు రజనీ, ఐసిడిఎస్. పిడి ఎస్.సూర్య లక్ష్మి, సిడిపిఓలు, జిల్లా విద్యా శాఖాధికారి డా. పి. రమేష్, గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఐ.కొండల రావు, అసిస్టెంట్ ట్రైబల్ వెల్ఫేర్ ఆఫీసర్ ఎల్. రజని, పిఒడిటిటి డా. భారతి, చైల్డ్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం జిల్లా కన్వీనర్ లవకుశ, ఇతర శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

మాల మహానాడు

ఉత్తరాంధ్ర అధ్యక్షునిగా గొల్ల ఈశ్వరరావు

విశాలాంధ్ర - పెందుర్తి: ఉత్తరాంధ్ర జిల్లాల మాల మహానాడు అధ్యక్షుడిగా పెందుర్తి ప్రాంతానికి చెందిన గొల్ల ఈశ్వర్రావు, ఉపాధ్యక్షుడిగా బేలిమేర విష్ణు నియమితులయ్యారు. వారిని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు జగడం సత్యనారాయణ పెందుర్తిలో సోమవారం ఘనంగా సత్కరించారు. ఉత్తరాంధ్ర జిల్లాల పర్యటనలో భాగంగా పెందుర్తి వచ్చిన సత్యనారాయణకు దళిత సంఘాలు పూలమాలలతో స్వాగతించారు. ఉత్తరాంధ్రలో దళితుల సమస్యలు పరిష్కరించడానికి, గొల్ల ఈశ్వరావు, విష్ణును అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా నియమించామని తెలిపారు. స్వాతంత్రం వచ్చి ఏళ్ళు గడుస్తున్నా దళితులు నేటికీ ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రానున్న కాలంలో దళితుల ఎదుర్కొంటున్న సమస్యలు దశలవారీగా పరిష్కరించి, వారిని ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా బలోపేతం చేయడానికి తమ వంతు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మాల మహానాడు ప్రధాన కార్యదర్శి నాగభూషణం, కుల వివక్ష నిర్మూలన అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు గాడి ప్రసాద్, జాతీయ కార్యదర్శి కె.నాగేశ్వరరావు, బొబ్బ దేవుడు బాబు, విజయనగరం జిల్లా మాల మహానాడు ప్రధాన కార్యదర్శి కనితి విజయ్, ఎల్లపు నగేష్, డి.దేముడు పలువురు దళితులు పాల్గొన్నారు.

పొగమంచు సోయగం.. ప్రకృతి ప్రేమికుల పరవశం

విశాలాంధ్ర - యలమంచిలి రూరల్: మైదాన ప్రాంతంలో మన్యం వాతావరణం నెలకొంది అనడానికి నిదర్శనమే సోమవారం ఉదయం తెల్లవారుజాము నుంచి యలమంచిలి పట్టణ, పరిసర గ్రామాలలో పొగమంచు దట్టంగా కమ్మేసింది. ప్రధానంగా యలమంచిలి ఆర్టీసి కాంప్లెక్స్, రైల్వే స్టేషన్ పొగమంచు కప్పెయ్యడంతో ఒకరికొకరు ఎదురుగా వస్తున్న కనిపించలేదు. దానితో పాటుగా జాతీయ రహదారిలో వాహనాల రాకపోకలకు కాస్తంత అంతరాయం ఏర్పడింది. ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించక పోవడంతో వాహనాలు నెమ్మదిగా ప్రయాణించాయి. ఒకపక్క పొగ మంచు ప్రకృతి ప్రేమికులను పరవశమయ్యేలా ఆకట్టుకుంది. పొగ మంచు సోయగాలను తమ సెల్ ఫోన్ కెమెరాలలో బంధించారు.

జీవీఎంసీ ప్రత్యేక (బడ్జెట్) సమావేశం వాయిదా

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: విశాఖపట్నం నగరపాలక సంస్థలో ఈ నెల 15వ తేదీన జరగవలసిన ప్రత్యేక బడ్జెట్ సమావేశం ఉత్తరాంధ్ర పట్టభద్రుల శాసన మండలి ఎన్నికల ప్రవర్తనా నియమావళి కారణంగా వాయిదా వేసినట్టు జీవీఎంసీ కమిషనర్ పి.రాజాబాబు తెలిపారు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం పట్టభద్రుల నియోజక వర్గం శాసనమండలి సభ్యుల ఎన్నికల ప్రవర్తన నియమావళి అమల్లో ఉన్నందున 15వ తేదీన జరగవలసిన బడ్జెట్ సమావేశం వాయిదా వేసినట్లు తెలియజేశారు. ఎన్నికల నియమావళి గడువు ముగిసిన తర్వాత బడ్జెట్ సమావేశం తేదీని తెలియజేయనున్నట్లు తెలిపారు.

1/70 చట్టానికి తూట్లు పొడుస్తున్న గిరిజనేతరులు

విశాలాంధ్ర - అనంతగిరి: గిరిజన ప్రాంతంలో గిరిజనులకు రక్షణ కవచంగా ఉన్న 1/ 70 చట్టం మండలంలో దుర్వినియోగం అవుతుంది. మండల పరిధిలో పంచాయతీ డముకు గ్రామంలో గిరిజనేతరులు తమకు నచ్చిన చోట దుకాణాలు, ఇల్లు కట్టి క్రయవిక్రయాలు విచ్చల విడిగా జరుపుకుంటున్నారు. ఈ విషయంపై రెవెన్యూ అధికారులు చూసి చూడనట్లు వదిలేయడంతో గిరిజనేతరులకు కాసుల వర్షం కురిపిస్తున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ వ్యాపారంలో లక్షల రూపాయలు చేతులు మారుతున్నట్టు విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా డముకు గ్రామంలో 1/70 యాక్ట్‌కు రక్షణ కల్పించాల్సిన అవసరం ఎంతైనా వుందని స్థానికులు చెబుతున్నారు.

మృతి చెందిన కుటుంబాలకు జగనన్న బీమా ఆసరా

విశాలాంధ్ర - చింతపల్లి: గత గురువారం మరణించిన షేక్ సంధాని కుటుంబానికి జగనన్న బీమా లక్ష రూపాయలను అందించినట్టు స్థానిక సర్పంచ్ దురియా పుష్పలత తెలిపారు. చింతపల్లి గ్రామానికి చెందిన సంధాని విశాఖ కింగ్ జార్జ్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించాడు. మరణించిన వ్యక్తి కుటుంబ సభ్యులకు నాలుగు రోజులలోనే జగనన్న బీమా పథకం ద్వారా లక్ష రూపాయలను వైస్ సర్పంచ్ షేక్ నూరు సాహెబ్, ఈవోపీఆర్డి, పంచాయతీ కార్యదర్శి కే శ్రీనివాస్, వెల్ఫేర్ అసిస్టెంట్ సుమిత్ర చేతుల మీదుగా సోమవారం అందజేశారు.

మానవ హక్కుల రక్షణ సమితి జిల్లా అధ్యక్షునిగా బాబూరావు

విశాలాంధ్ర - చింతపల్లి: జాతీయ మానవ హక్కుల రక్షణ సమితి అల్లూరి జిల్లా అధ్యక్షునిగా చింతపల్లి మాజీ ఎంపీపీ వంతల బాబూరావు నియమాకం అయ్యారు. జాతీయ మానవ హక్కుల రక్షణ సమితి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ వ్యవస్థాపక అధ్యక్షుడు, హైకోర్టు న్యాయవాది ఆర్ కరుణాకర్ చేతుల మీదుగా నియామక పత్రం అందుకున్నారు. గిరిజనుల చట్టాలను, హక్కులను ఎవరూ అతిక్రమించ రాదని చట్టం చెబుతున్నా, బినామీ వ్యవస్థ ద్వారా పట్టా భూముల లీజులు పెరిగిపోతున్నాయని, ముందుగా వాటిని కట్టడి చేయవలసిన అవసరం ఎంతైనా ఉందని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు.

అమెజాన్ డాట్ ఇన్‌పై గెట్ ఫిట్ డేస్‌తో ఫిట్‌నెస్ ప్రయాణం

విశాలాంధ్ర - విశాఖ సిటీ: గెట్ ఫిట్ డేస్‌తో అమెజాన్ మళ్లీ వచ్చింది, ట్రెడ్ మిల్స్, సైకిల్స్, యోగా మ్యాట్స్, స్మార్ట్ వాచ్, స్పోర్ట్స్ షూస్, స్పోర్ట్స్ అప్పారెల్, జిమ్ యాక్సెసరీస్ వంటి ఉత్పత్తులను ఒకే చోట ఉంచి కస్టమర్స్ కు సమగ్రమైన షాపింగ్ అనుభవం ఇస్తోంది. ఈ గొప్ప డీల్స్ ను 10 నుండి 12 ఫిబ్రవరి 2023 వరకు పొందండి. పవర్ మ్యాక్స్, ఫ్యూమా, అర్బన్ టెర్రైన్, నివియా, ఆడిడాస్, రీబక్, లైఫ్ లాంగ్, ఫ్లెక్స్ నెస్ట్, యోనెక్స్, గార్మిన్, ఇంకా ఎన్నో ప్రముఖ బ్రాండ్స్ నుండి అమెజాన్ డాట్ ఇన్‌పై 'గెట్ ఫిట్ డేస్' సమయాం 70 శాతం వరకు ఉత్తేజభరితమైన డిస్కౌంట్స్‌ను కస్టమర్స్ పొందవచ్చు. ఇంకా ఫిట్ నెస్, క్రీడల ఎంపికపై రూ.1500 కనీస ఆర్డర్ కొనుగోలుపై రూ.300 వరకు అదనపు 10 శాతం తగ్గింపు పొందవచ్చు.

కుష్టు వ్యాధిని నిర్మూలిద్దాం

విశాలాంధ్ర - రాజవొమ్మంగి: జాతీయ కుష్టువ్యాధి నిర్మూలన దినోత్సవం సందర్భంగా వైద్యాధికారి లిఖిత హైస్కూల్ విద్యార్థులతో కలిసి కుష్టువ్యాధిపై అవగాహన ర్యాలీ చేపట్టారు. పీహెచ్‌సీ నుండి హైస్కూల్ వరకు ర్యాలీ చేపట్టి కుష్టు వ్యాధిని నిర్మూలిద్దాం, అపోహలను నమ్మొద్దంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యసిబ్బంది సీహెచ్‌ఓ పద్మావతి, ఎంపి హెచ్ ఇఓ నాగవాసు పాల్గొన్నారు.